

# కిషన్ చందర్ రచనలు 5



# విరిగిన విగ్రహాలు

నవల

*Kishan Chander Rachanalu - 5* **VIRIGINA VIGRAHAALU**

*(Novel)*

| | | | |
|---|---|---|---|
| ప్రచురణ నెం. | : | 2350/631-1*R* | గతముద్రణ 1966, |
| ప్రతులు | : | 1,000 | |
| ద్వితీయ ముద్రణ | : | జనవరి, 2018 | |
| టైటిల్ డిజైన్ | : | గిరిధర్ | |

© విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

**వెల : 80/-**

**ప్రతులకు**

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
33-22-2, చంద్రం బిల్డింగ్స్
చుట్టుగుంట, విజయవాడ-520004
ఫోన్ : 0866-2430302
Email : vphpublish@gmail.com

**విశాలాంధ్ర బుక్‌హౌస్**
విజయవాడ, విశాఖపట్నం,
అనంతపురం, గుంటూరు
తిరుపతి, కాకినాడ, ఒంగోలు
శ్రీకాకుళం, కడప, విజయనగరం

**హెచ్చరిక :** ఈ పుస్తకంలో ఏ భాగాన్నైనా పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ కాపీరైట్ హక్కు కలిగినవారి నుండి లేక ప్రచురణకర్తల నుండి ముందుగా రాతపూర్వక అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం.

**ముద్రణ : విశాలాంధ్ర విజ్ఞాన సమితి ముద్రణాలయం - విజయవాడ**

# హాజీపీర్

**అ**ప్పుడు నాకు అయిదేళ్ళ వయస్సు వుంటుంది. ఆకాశం నీలంగా కన్పించింది. నిర్దయగా వున్నట్లనిపించింది. గాలి కూడా మంచు ముద్దలాగా చల్లగా వుంది. నేను ఓ కంచరగాడిద మీద కూర్చొని యేడుస్తూ పోతున్నాను. అలా గొంతెత్తి పెద్దగా యేడుస్తూ వుంటే, ఆ యేడ్పులోనుంచి సంగీతం పాడుతున్నట్లుగా ఓ విధమైన లయ కూడా బయలుదేరింది. అందుచేత నా యేడ్పును యెవ్వరూ లక్ష్య పెట్టడం లేదు. ముందు పోతున్న కంచరగాడిద మీద మా అమ్మ కూర్చున్నది. మా తమ్ముడైన మహేంద్రుణ్ణి ఆమె తన ఒళ్ళో కూర్చోబెట్టుకుంది. వాడి కింకా ఓ సంవత్సరమైనా దాటలేదు. అందుచేత వాణ్ణి వేరే ఒంటరిగా కూర్చోబెట్టలేదు. మహేంద్రుడు హాయిగా అమ్మ ఒళ్ళో కూర్చున్నాడు. నాకు అయిదేళ్ళ వయస్సు వుంది కదా! పెద్ద ఆరితేరిన రౌతు ననుకున్నారు. వెనక బోతున్న యీ కంచరగాడిద మీద నన్ను ఒంటరిగా కూర్చోబెట్టారు.

ఆ కంచరగాడిద మీద ప్రయాణం చేయడం, ఆ కొండల్లో గుండా వెళ్ళడం అదే మొదటిసారి. నాకు ఆ రెండూ నచ్చలేదు. అప్పటి వరకూ నేను రైలులోనూ, బస్సులోనూ ప్రయాణం చేశాను. టాంగా యెక్కాను. లాహోరు వీధుల్లో తిరిగాను. పంజాబులోని పచ్చని మైదానాల మీద పెరిగాను. అందువల్ల యీ ప్రాంతం నాకు చాలా కొత్తగా వుంది. ఒక కొండ దాటిపోగానే మరో కొండ వస్తూనే వుంది. అన్నీ కొండలే! మైదానమనేది మచ్చుకు కూడా కన్పించడం లేదు. ఆ కంచర గాడిదను చూడబోతే అదొక విచిత్రమైన జంతువు. ఎగుడు దిగుడుగా యెగురుతూ పోతున్నది. మిట్టలు యెక్కేటప్పుడు జీను వెనక్కు జారుతూ వుంది. పల్లానికి దిగుతున్నప్పుడు దాని మెడమీది కొచ్చి పడుతున్నాను. దాని వీపుమీద ఒకచోట కదలకుండా కూర్చోలేక పోతున్నాను. అమ్మ ఒళ్ళో హాయిగా కూర్చోవచ్చును. కాని అక్కడ మా తమ్ముడు మహేంద్రుడు కూర్చున్నాడు.

ఆ కంచరగాడిద యజమాని కూడా నా యేడ్పును లక్ష్యపెట్టకుండా, నా ప్రక్కనే

నడుస్తూ వస్తున్నాడు. అతని చేతిలో యెండిపోయిన ఓ సన్నని బెత్తం వుంది. అప్పుడప్పుడు దానితో ఆ కంచరగాడిదను కొట్టేవాడు. కొట్టినప్పటికీ దానిమీద ఆ దెబ్బ ప్రభావం యేమీ కన్పించేది కాదు. అయినా అలా కొట్టడం అతనికి అలవాటయి పోయింది. అలా అప్పుడప్పుడు దెబ్బలు తినడం దానికీ అలవాటయి పోయింది. గ్రుడ్డికన్ను మూసినా ఒకటే తెరచినా ఒకటే. ఆ కంచరగాడిదను కొట్టినా ఒకటే, కొట్టక పోయినా ఒకటే. దాని నడక యెప్పుడూ ఒకటిగానే వుంటున్నది. దారి యెగుడు దిగుడుగా వున్నచోట, మిట్టపల్లాలు దాటేచోట అతడు నా వీపుమీద చేయి వేసుకొని, నా ప్రక్కనే నడుస్తూ, నేను పడిపోకుండా జాగ్రత్త పడుతూ వుండేవాడు. అతను అప్పుడప్పుడు పాటలు పాడేవాడు. పెద్ద రాగం తీసేవాడు. అతని రాగంలో నా రాగం వినిపించకుండా పోయేది. నేను చేసేది లేక నా ఏడ్పునూ, రాగాన్నీ కొంచెం తగ్గించుకునే వాణ్ని. అతడి రాగం కొంచెం తగ్గగానే నేను మళ్ళీ బిగ్గరగా ఏడ్చేవాణ్ని. నా రాగం పెద్దదయ్యేది. కాని నా రాగాన్ని యెవ్వరూ వినిపించుకోవడమే లేదు.అతడు నా వాహనాన్ని ఆ బెత్తంతో కొట్టుకుంటూ, మళ్ళీ రాగాలు తీస్తున్నాడు. ఆ కంచరగాడిద ఆ బెత్తం దెబ్బలు తింటూ మామూలుగానే ముందుకు పోతూ వుంది. తిరిగి కూడా చూడడం లేదు. ఏడ్చి ఏడ్చి అలసిపోయాను. కారిన కన్నీటి ధారల చారలు కూడా ఆరిపోయాయి. ఆరోహణతో, అవరోహణతో అలసి సొలసి నా గొంతు కూడా ఆరిపోయింది. దారిలో అనేక చెట్లు వస్తూ పోతూ వున్నాయి. ఓ మిట్ట యెక్కి దిగడంతోనే మరో మిట్ట యెక్కవలసి వచ్చేది. పోనీ ఏడ్పు మానేద్దామా అంటే మానే దెట్లా? అది నా గౌరవానికీ, నా ఆధిక్యతకూ సంబంధించిన సమస్య. నేను కూడా అమ్మ దగ్గర కూర్చోవాలని అనుకుంటున్నాను. కాని అక్కడ మహేంద్రుడు కూర్చున్నాడు. 'సరేలే వుండండి! ఈ సారి కొండ మలుపు రానివ్వండి! ఈ కంచరగాడిద మీదనుంచి యెగిరి ఒక్క దూకు దూకి, ఏ లోయలోనైనా పడి చచ్చిపోతానులే! అప్పుడు మా అమ్మ నాకు చేసిన అన్యాయాన్ని తెలుసుకోగలుగుతుంది' అనుకుంటూ బిగ్గరగా శోకాలు బెడుతూ రాగాలు తీశాను.

ఇంతలో చాలా అందంగా వున్న ఒక లోయలోకి వచ్చాము. ఏటవాలుగా వున్న ఆ ప్రదేశంలో అనేక గొర్రెలు మేస్తూ కన్పించాయి. ఇద్దరు కుర్రవాళ్ళు ఆ గొర్రెలను కాస్తూ వున్నారు. ఇద్దరిలో ఒకడు నా కంటె మూడు నాలుగేళ్ళు పెద్దవాడై వుంటాడు. రెండవ వాడి వయస్సు కూడా పది పదకొండేళ్ళ కన్న మించి వుండదు. ఇద్దరూ పచ్చగా వున్న ఆ పచ్చిక మీద కూర్చొని చేతిలో వున్న రాతితో ఏమిటో పగలగొట్టుకొని తింటూ వున్నారు.

వాళ్ళను చూడగానే ఏడ్పు మరచిపోయాను. ఆ కంచర గాడిద యజమానిని అడిగాను –

"వీళ్ళు తింటున్న దేమిటీ?"

"పచ్చి ఆక్రోటు పండ్లు."

ఆ చిన్న కుర్రవాళ్ళు యెంతో స్వేచ్ఛగా, సంతోషంగా, స్వతంత్రంగా వున్నట్లు కన్పించారు. వాళ్ళు నా మాదిరిగా ఏడుస్తూ కూచోలేదు. అయినా నా లాగా కంచరగాడిద మీద కూర్చొని ప్రయాణం చేయవలసి వస్తే వాళ్ళకు కూడా తెలిసేది. ఆ కుర్రవాళ్ళ కాళ్ళూ, మోకాళ్ళూ నగ్నంగానే వున్నాయి. వాళ్ళు బూడిదరంగులో వున్న ఉన్ని చొక్కాలు తొడుక్కున్నారు. ఆ చొక్కాలు అక్కడక్కడ చిరిగిపోయి కూడా వున్నాయి. వాళ్ళు నా మాదిరిగా కోటూ, బూటూ, నిక్కరూ, స్వెట్టరూ తొడుక్కొని లేరు. మేజోళ్ళతో కళ్ళజోళ్ళతో ముస్తాబై లేరు. వాళ్ళు లొట్టలు వేసుకొంటూ తింటుంటే, ఆ పదార్థ మేమిటో చాలా మంచిదైనట్లూ, చాలా రుచిగా వున్నట్లూ అనిపించింది. నాకు కూడా నోరూరింది. నోట్లో నీరూరింది. అదేమిటో నాకు కూడా కావాలని మారాము చేశాను.

"నేను కూడా పచ్చి ఆక్రోటు పండ్లు తింటాను. ఈ కంచరగాడిదను యిక్కడనే ఆపు! నేను కూడా ఆక్రోటు పండ్లు తింటాను."

"మనం కొంచెం దూరం ముందుకు సాగిపోతే 'చార్‌సవార్' కనుమ దగ్గర ఆక్రోటు పండ్లు దొరికే అడవి తగులుతుంది. అక్కడ నీకు కావలసినన్ని ఆక్రోటు పండ్లు తెచ్చిపెడతాను. అక్కడ నీ యిష్టం వచ్చినన్ని పండ్లు తినవచ్చును." అంటూ ఆ కంచర గాడిద యజమాని నన్ను ఓదార్చబోయాడు.

"కాదు. నాకు యిప్పుడే కావాలి" అంటూ మరీ బిగ్గరగా ఏడ్చాను.

ముందు పోతున్న కంచరగాడిదను మా అమ్మ ఆపించింది. ఆమె దానిమీద కూర్చునే కొద్దిగా నా వైపుకు తిరిగి, నా ప్రక్కనే నడుస్తున్న వానితో చెప్పింది – "అజీజూ! పెదబాబును నాకు అందించి, చినబాబును నీవు యెత్తుకో! వాణ్ణి దాని మీద కూర్చోబెట్టవద్దు. నీవు యెత్తుకొని నడుస్తూ వుండు."

"అట్లాగేనండీ!"

అతడు మా మహేంద్రుణ్ణి యెత్తుకున్నాడు. నేను యెగురుకుంటూ పోయి అమ్మ ఒళ్ళో కూర్చున్నాను. అమ్మ నన్ను హృదయానికి హత్తుకుంది. మా వాహనం ముందుకు సాగిపోతూ వుంది.

మా వెనక మహేంద్రుడు కూడా ఏడుస్తూ వస్తున్నాడు.

ఇప్పుడు ఆ కంచరగాడిద ఓ పెండ్యులంలాగా వూగుతూ నడుస్తున్నది. నేను కూడా పెండ్యులమ్ మాదిరిగానే ఉయ్యాల లూగుతూ హాయిగా అమ్మ ఒళ్ళో కూర్చుంటే నిద్ర వస్తూ పోతూ వుంది. నిద్ర తేలిపోగానే ఆకలయింది. అప్పటికి మేము తిండితిని రెండు గంటలైనా కాలేదు. కాని ప్రయాణం చేస్తుంటే ఒకటే ఆకలి. అందులో ఆ కొండల్లో గుండా పోతుంటే అపరిమితమైన ఆకలయ్యేది. గట్టిగా అడిగితే అమ్మ నన్ను దింపివేస్తుందని, దడుస్తూ దడుస్తూనే నెమ్మదిగా "ఆకలవుతూందమ్మా!" అన్నాను.

మూడు ఝాములకు మేము హాజీపీర్ కనుమ దగ్గరకు చేరుకున్నాము. అక్కడ ఆగిపోయాము. అక్కడికి చేరగానే ఆకాశం పెద్దదయి పోయింది. చాలా దూరం వ్యాపించి పోయింది. ఓ పెద్ద నీలి రంగు గొడుగులాగా విస్తరించుకు పోయింది. అలా విస్తరించుకున్న నిర్మలమైన నీలాల నింగిని నేను చాలా తక్కువగానే చూసి వుంటాను. స్వర్ణకాంతు లీనుతున్న సూర్యగోళపు పరధిని చూస్తుంటే, ఆ సూర్యుణ్ణి గుండ్రంగా కత్తిరించి ఆకాశాని కంటించా రన్నట్లుగా వుంది. దృష్టిపోయినంత వరకు దృశ్యాలను చూస్తూనే వున్నాను. అనేక మైళ్ళు వ్యాపించి వున్న ఆ పుంచ్ ప్రాంతపు లోయలూ, కనుమలూ, పచ్చికతో నిండి వున్న పచ్చని మైదానాలూ, పర్వతాలూ, పర్వత శిఖరాలూ, నదులూ, సెలయేళ్ళూ, అడవులూ, పల్లెలూ, ఆ పొలాలూ అన్నీ అందమైన రంగుల్లో అచ్చువేసిన పుస్తకంలో తళతళా మెరిసే పేజీల్లాగా వాటిమీద కళకళలాడే బొమ్మల్లాగా కన్పించాయి. జీవితంలో అంత అందమైన ప్రకృతి సౌందర్యాన్ని అక్కడే మొదటిసారిగా దర్శించాను.

ఇది నా మొదటి అనుభవం. ఇది అనుభవం మాత్రంగానే వుండిపోలేదు. ఈ అనుభవం ఓ బలమైన కోరికగా నా మనసులో నుంచి బయలుదేరింది. హాజీపీర్ కనుమ నుంచి రెక్కలు కట్టుకొని యెగురుదామనీ, యెదురుగా వున్న ప్రతి లోయనూ, కనుమనూ దాటి, దిక్చక్రం మీదుగా ఆవలి గట్టుకు చేరిపోదామనీ అనిపించింది.

నేను మా అమ్మతో అన్నాను – "నేను యెగిరిపోగలను. ఇక్కడ నుంచి ఎగిరిపోయి మా నాన్న దగ్గరకు చేరుకోగలను."

"అయితే యెగిరిపో!" అన్నది మా అమ్మ.

"ఎగరలేను."

"ఎందుకని?"

"ఆకలవుతూంది."

అమ్మ నవ్వుతూ అన్నది – "నీవు చాలా కొంటెవాడివిరా!"

తరువాత ఆమె కంచరగాడిద యజమాని అయిన అజీజ్‌తో ఏమిటో చెప్పింది. అతను తలకాయ వూపుతూ, ఆ కనుమ అంచుల మీద నిలబడి యెదురుగా ఏకాంతంగా కనబడుతున్న ఓ మట్టి యింటివైపు చూశాడు.

హాజీపీర్ కనుమకు కుడిప్రక్కన, యెడంప్రక్కన, యిరువైపులా లోతుగా వున్న లోయలూ, కందకాలూ, గుంటలూ భయంకరంగా కన్పిస్తున్నాయి. ఆ కొండ అంచుమీది నుంచి వెళ్ళే దారిలో ఒకవైపు మట్టి గోడలతో కట్టిన ఒక పూరిల్లు కన్పించింది. మరో వైపు హాజీపీర్ గోరీ వుంది. ఆ గోరీ వద్ద ఆకులు రాలిపోయిన కొమ్మలతో ఓ చెట్టు నిలబడి వుంది. దానిమీద చిరిగిపోయిన జెండా ఒకటి రెపరెపలాడుతూ వుంది. ఆ చెట్టు కొమ్మల నిండా మురికి బట్టిన చిన్న చిన్న పొట్లాలు కట్టి వున్నాయి. దూరంగా వుండి చూస్తుంటే ఆ పొట్లాలు నల్లగా యెండిపోయి వున్న ఆ చెట్టు కాయలేమో ననిపిస్తుంది.

ఆ పూరింట్లోనే షర్ఫూ వుంటున్నాడు. అతని పూర్తి పేరు షర్ఫుద్దీన్. అక్కడే హాజీపీర్ దర్గాకు అర్చకుడు కూడా. హాజీపీర్ లోయలో మంచి చెడ్డలు చూసేవాడు కూడా అతడే. హాజీపీర్ దర్గా దగ్గర వున్న దుకాణదారుడు కూడా అతడే. అతడు యెండు ఆక్రోటు పండ్లు, గంగరేగు పండ్లు, సీమరేగు పండ్లు, మొక్కజొన్న పొట్టలూ, ఔషధాలకు పనికి వచ్చే ఆకులూ, వేరులూ అమ్ముతూ వుంటాడు. రాత్రి పూట హాజీపీర్ కనుమకు చేరుకున్న యాత్రీకులు అతని యింటి వద్దనే విశ్రమిస్తారు. అతని వద్ద మొక్కజొన్న పిండి కొనుక్కుంటారు. ఆలుగడ్డలు లేకపోయినా ఉల్లిగడ్డలూ, యెండు మిరపకాయలు నూరి పచ్చడి చేసుకుంటారు. ఆ తిండి తిని, యిన్ని మంచినీళ్ళు త్రాగి, ఆ రాత్రికి కంబళ్లు కప్పుకొని ఆ కటికి నేలమీదే నిద్రపోతారు? షర్ఫూ భార్య చనిపోయింది. అతనికి ఓ కూతురు వుంది. ఆమె పేరు సైదాబీబీ. తల్లిలేనిపిల్ల కావడంచేత అతని చేతివ్రేలు పట్టుకొని నిత్యం అతని వెంటే తిరుగుతూ వుంటుంది. సైదాబీబీకి మూడు నాలుగేళ్ళ వయస్సు వుంటుంది. తల వెంట్రుకలకు ఏదో నూనె రాసుకుంది. కళ్ళకు కాటుక పెట్టుకుంది. చేతులకు గాజులు తొడుక్కుంది. ఆమె లేత బుగ్గలు ఎర్రగా చిదిమితే రక్తం కారేటట్లుగా వున్నాయి. ఆ సైదాబీబీ చాలా అభిమానం గల పిల్ల. ఎదుటబడి సరీగా మా వైపు చూసేది కూడా కాదు. అప్పుడప్పుడు దొంగ చూపులతో నా మఖమల్ కోటునూ, ఉన్ని స్వెట్టరునూ చూసేది. కాని మమ్ములను చూడగానే మే మేదో మూర్ఖుల మన్నట్లుగా మూతి ముడుచుకొని నొసలు విరిచేది.

“పాలు దొరుకుతాయా?” అని మా అమ్మ షర్ఫూను అడిగింది.

“ముంత పావలా” అన్నాడు షర్ఫూ.

ఆ ముంత అంటే యేమిటో, యెంత వుంటుందో మా అమ్మకు అర్థం కాలేదు. "ముంతకు యెన్ని పాలు వస్తాయి" అని అడిగింది.

"ముంతకు ముంతెడు పాలు వస్తాయి." అన్నాడు షర్ఫ్హా.

"ఓ ముంతెడు పాలు తెచ్చియివ్వు." అని చెప్పింది అమ్మ.

ముంతంటే యే పావుసేరో, అర్ధసేరో అయివుంటుందనీ, మనుషులులేని యీ అడవిలో పావలాకు పావుసేరిచ్చినా, అందులో సగం యిచ్చినా ఫరవాలేదనే మా అమ్మ అనుకున్నది.

నా కళ్ళముందే షర్ఫ్హాలేచి యేటవాలుగా వున్న ఆ నేలమీద నిలబడి మట్టి త్రవ్వుతూ వున్నాడు.

"మట్టి త్రవ్వుతున్నా వెందుకూ?" అని అడిగాను.

"పాలు బయటికి తీస్తున్నాను."

"ఏమిటీ? హాజీపీర్ మట్టిలోనుంచి పాలు వస్తాయా?" అంటూ మా అమ్మ ఆశ్చర్యంగా అడిగింది.

షర్ఫ్హా జవాబు చెప్పకుండానే మట్టి త్రవ్వుతూ వున్నాడు. కొంచెం సేపు త్రవ్విన తరువాత అతడు ఆ భూమిలో అడుగున పడివున్న ఓ మట్టి పిడతను పైకి తీశాడు. ఆ పిడత నిండా తియ్యగా, చల్లగా తెల్లని పాలు వున్నాయి.

"ఇక్కడ నేల చాలా చల్లగా వుంటుంది. ఈ చల్లని మట్టిలో పాలు యెన్ని రోజులు నిలువవుంచినా చెడిపోవు" అన్నాడు షర్ఫ్హా.

అంత మంచి పాలు, అంత తియ్యని పాలు నా జీవితంలో నేటి వరకూ త్రాగి యెరుగను. ఆ పాలు త్రాగిన తరువాత అవి యే మాత్రమూ చెడిపోలేదనీ, అప్పుడు తీసిన పాలులాగా వున్నాయనీ అతడు చెప్పకుండానే మాకు తెలిసిపోయింది.

హాజీపీర్ కనుమలోని మట్టిలోనుంచి ఆ విధంగా పాలు పైకి పొంగుతాయి. పాలను మట్టి పాత్రలలో పోసి ఆ విధంగా ఆ మట్టిలోనే భద్రంగా దాచుకుంటారు. ఆ మట్టి పాత్ర షర్ఫ్హా చెప్పినట్లు ముంతా కాదు, నేననుకున్నట్లు పిడతా కాదు. దాన్ని ఓ పెద్ద కుండ అనే చెప్పవచ్చును. ముంతెడు పాలు అంటే దాదాపు అయిదుసేర్ల పాలు వుంటాయి. అక్కడ పావలాకు అయిదుసేర్లు పాలు దొరికేవి. షర్ఫ్హా మా దగ్గిర ఆ పావలా ముందుగానే అడిగి పుచ్చుకున్నాడు. అలా ముందుగానే డబ్బులు అడుగుతూ కొంచెం సిగ్గుపడ్డాడు కూడా. ముందుగానే డబ్బులు చేతిలో పడవేయించు కున్నాడంటే అందుకు కారణం గూడా వుందని తరువాత తెలిసింది.

"ఇక్కడకు వచ్చే అధికారులు సాధారణంగా పాలు తీసుకొని డబ్బు లివ్వకుండానే

పోతుంటారు.” అన్నాడు షర్ఫూ. ఆ తరువాత ఓ పెద్ద నేరం చేసిన వాడిలాగా కళ్ళు వాల్చుకొని, “నేను బీదవాణ్ని.” అన్నాడు.

మా అమ్మ షర్ఫూకు ఆ పావలా ముందుగానే యిచ్చివేసింది. ఎందుకంటే ఆమె అధికారి కాదు. అధికారి భార్య. ఆ ప్రాంతానికి కొత్తగా వచ్చింది. ఆమె హాజీపీర్ దర్గాకు తలవంచి నమస్కరించింది. మత భేదమనేది లేకుండా మా అమ్మ ముస్లిం ఫకీరుల దర్గాలకూ, హిందూ సాధువుల సమాధులకూ శ్రద్ధాంజలి ఘటిస్తూ వుంటుంది. ఆ భక్తి శ్రద్ధలు ఆమె రక్తంలో మిళితమై వున్నాయి. జాతీయ ఐక్యతను గురించిన పుస్తకమేదీ ఆమె చదవలేదు. మత సహనాన్ని గురించి చెప్పే ఉపన్యాసాలు ఆమె వినలేదు. మానవత్వమనీ, సమానత్వమనీ, సర్వమానవ సౌభ్రాతృత్వమనీ చెప్పే పెద్ద పెద్ద సంగతులు ఆమె కేమీ తెలియవు. నేటివరకు ఆమె వార్తాపత్రిక అంటూ చదవలేదు. రేడియో వినలేదు. సినిమా చూడలేదు. ఆమె ఓ సనాతన హిందూ మహిళ. దేవాలయానికి వెళ్ళేది. గురుద్వారాకు వెళ్ళేది. రోజూ జపం చేసుకుంటుంది. పూజలు పునస్కారాలు చేసుకుంటుంది. ముస్లిం దర్గాలకు కానుకలు సమర్పిస్తుంది. ఇటువంటి భక్తి శ్రద్ధలన్నీ ఆమె రక్తంలోనే కలిసి పోయి వున్నాయి. ఆ చదువు సంధ్యలు లేని రోజుల్లో కూడా ఆనాటి అఖండ భారతాన్ని అభిలషించి అభిమానించిన మహిళ. ఆమె ఆచారం ఆనాటి మత సామరస్యాన్ని గుర్తుకు తెస్తూ వుంది. అనేక శతాబ్దాలుగా చేసిన అనేక ప్రయత్నాల ఫలితంగా భిన్నత్వంలో యేకత్వం సాధించుకొని, అనేక జాతుల ఐకమత్యంతో, అనేక మతాల సామరస్యంతో ఆనాడు అందరూ కలసి మెలసి రూపొందించుకున్న భారతీయ సంస్కృతికి సమన్వయం ఒక ఆచారమైపోయింది. అటువంటి సమన్వయంతో వున్న ఆనాటి అఖండ భారతాన్ని ఒక్క అర్ధశతాబ్దంలోనే మరచిపోయారు. అఖండ భారతం అరుగున బడిపోయింది. అన్ని చదువులూ మాకే వచ్చుననుకున్న అభిమానులు ఒక్క అర్ధశతాబ్దంలోనే ఆ మత సామరస్యాన్నీ, సమన్వయంతో రూపొందించుకున్న ఆ సంస్కృతినీ తుత్తునియలు చేసి ద్వేషాగ్నిలో పడవేశారు.

కాని యిదంతా తరువాత జరిగిన విషయం.

నేటికి నలభై అయిదు సంవత్సరాలకు పూర్వం. అంటే దాదాపు అర్ధశతాబ్దానికి పూర్వం, ఒకనాడు మూడవ ఝామున నేను మా అమ్మ చేతివ్రేళ్ళు పట్టుకొని నడుస్తూ మొట్టమొదటి సారిగా హాజీపీర్ కనుమను చూశాను. మా అమ్మ మా తమ్ముణ్ణి యెత్తుకొని ఆ కొండమీద నుంచి క్రిందికి దిగుతూ ఆ లోయవైపే చూస్తూ వుంది. ఆ కొండ కనుమల్లో దాగియున్న ఏ లోయలోనో ఆమె భర్త అంటే మా నాన్న ఉద్యోగం చూసుకొందామని

వచ్చాడు. ఆయన చాలా బిడియపడే మనిషి. అయితే మంచిపేరు సంపాదించుకున్న డాక్టరు. ఆయన చేతుల్లో ఆరోగ్యం వుంది. ఆయన యెప్పుడూ మౌనంగా వుండే వ్యక్తి. చాలా ఆత్మాభిమానం కలవాడు. అంతకుముందు ఆయనొక ఎస్టేటులో ఉద్యోగం చేసేవాడు. అక్కడవున్న బ్రిటిష్ రెజిడెంట్‌తో తగాదా పెట్టుకున్నాడు. ఆ నేరానికి ఆయనకు చాలా కఠినమైన శిక్ష లభించింది. ఉద్యోగం కాస్తా వూడిపోయింది. దాని ఫలితంగా మేము దేశమంతా తిరగవలసి వచ్చింది. ఆ తరువాత బ్రిటిష్ ప్రభుత్వం మా నాన్నకు ఉద్యోగమంటూ లేకుండా చేసింది. ఎంతో ప్రయత్నంచేసి, యెంతో కష్టపడితే, యెంతో దూరాన వున్న యీపుంచ్‌ప్రాంతంలో మళ్ళీ ఆయనకు మెడికల్ ఆఫీసరు ఉద్యోగం దొరికింది.

మా నాన్న ముందుగానే యిక్కడకు వచ్చాడు. ఇక్కడ స్థిరపడగానే ఆయన మమ్మలను రమ్మని కబురు చేశాడు. ఎంతో దూరం నుంచి మేము యిక్కడకు వచ్చాం. లాహోరు వీధులు వదలిపెట్టి. వజీరాబాదులో మా పూర్వీకులు కట్టించిన గృహం వదలిపెట్టి, రైలులోబడి లాలామూసా వచ్చాము. అక్కడనుంచి కోహాలా చేరుకున్నాము. మా అమ్మ ఒక్కతే మమ్మల్ని తీసుకొని రావలసి వచ్చింది. కాని ఆమె చాలా ధైర్యం గలది. ఆమె సాహసం అద్భుతమైనది. మమ్మల్ని యిద్దరినీ వెంట బెట్టుకొని ఆమె ఒకతే బయలుదేరింది. ఎన్నో వందల మైళ్ళు ప్రయాణం చేసి యిప్పుడు హాజీపీర్ కనుమ వద్ద నిలబడి వుంది. ఇప్పుడు ఈ ప్రాంతమే మా నివాసమవుతుంది. ఈ భూమే మా జన్మభూమి అవుతుంది.

ఓ బిడ్డ చేతిని తన చేతిలోనికి తీసుకొని, ఓ బిడ్డను హృదయానికి హత్తుకొని ఆ కనుమవద్ద నిలబడివున్న మా అమ్మ మనసులో యేమి ఆలోచిస్తున్నదో కూడా తెలియకుండా వుంది.

ఇంతలో షర్ఫూ వచ్చి “అక్కయ్య గారూ! కానుకలు సమర్పించరూ?” అన్నారు.

“పదకొండు కానులు కానుకగా సమర్పించాను” అని చెప్పింది మా అమ్మ.

షర్ఫూ అడిగాడు “ఈ పిల్లవాడు మీ పెద్దబ్బాయి కదూ?”

“అవును!”

“అయితే మీ పెద్దబ్బాయిచేత గూడా కానుకలు యిప్పించండి!”

మా అమ్మ ప్రశ్నార్థకంగా చూచింది.

షర్ఫూ అన్నాడు “ఎంతో దూరం నుంచి, యెన్నో గ్రామాలనుంచి ప్రజలు ఇక్కడకు వస్తూ వుంటారు. ఈ హాజీపీర్ దర్గాను దర్శిస్తారు. తమ మొదటి బిడ్డను హాజీపీర్ బిడ్డగా స్వీకరించి ఆశీర్వదించమని కానుకలు సమర్పిస్తారు. తరువాత ఆ బాలుడు హాజీపీర్

బిడ్డగా ఈ దర్గా మీద మట్టిని రుచి చూస్తాడు. హాజీపీర్ బిడ్డగా ఆశీర్వాదం పొందిన బాలుడు యెక్కడకు వెళ్ళినా ఎంతో గౌరవం లభిస్తుంది."

మా అమ్మ అడిగింది "అందుకు యెన్ని కానులు కానుకగా సమర్పించాలి?"

"యాభై ఒక్కటి" అన్నాడు షర్ఫుద్దీన్.

అప్పుడు దారపు సంచిలో వున్న చిల్లర డబ్బుల్లోనుంచి మా అమ్మ యాభై ఒక్క కానులు తీసి షర్ఫుద్దీన్‌కు యిచ్చింది. నన్ను చేయిపట్టుకొని నడిపిస్తూ హాజీపీర్ దర్గా దగ్గరకు తీసుకొని వెళ్ళింది. నా తల దర్గామీద ఆనించాను. దర్గాను కళ్ళకద్దుకున్నాను. మా అమ్మ చెప్పినట్లల్లా చేశాను. షర్ఫూ నాపేరుమీద కూడా ఓ పొట్లం ఆ యెండిపోయిన చెట్టుకొమ్మకు కట్టేశాడు. ఆ దర్గామీది మట్టిని కొద్దిగా గిల్లి దానిలో కొంచెం బెల్లం కలిపి తినమని నాకు యిచ్చేశాడు. అది మట్టి అయినా అందులో బెల్లం కలపడం చేత తియ్యగా వుంది. సరదాగా తినేశాను. ఈ విధంగా నేను హాజీపీర్ బిడ్డనయ్యాను.

# హాజీపీర్ బిడ్డ

**ఆ** తరువాత దాదాపు ఎనిమిది సంవత్సరాలకు మళ్ళీ హాజీపీర్ కనుమను దర్శించాను. అది చలికాలం. మాకు చాలా దగ్గర చుట్టమైన ఒకాయన పెళ్ళి చేసుకో బోతున్నాడు. ఆ పెళ్ళికి వెళ్ళివద్దామని మేమందరం పంజాబుకు బయలుదేరాము. మా నాన్నగారు యీసారి కూడా మాతో రాలేదు. అయినా అనేకమంది ఉద్యోగులూ, నౌకర్లూ, చాకర్లూ, బంట్రోతులూ ఆఖరుకు కాంపౌండరుతో సహా కావలసినంత మందీ మార్బలం తోనే బయలుదేరాము. మేము వెళ్ళే చోటుకల్లా మా కంటె ముందుగానే "డాక్టరుగారింటి నుంచి పెళ్ళికి వెళ్ళుతున్నారనీ, దారిలో యిబ్బంది పడకుండా చూడవలసిందనీ" పోలీసు లకూ, పహరా జవానులకూ, గ్రామాధికారులకూ కబురుపోతూనే వుంది. అవి చలిరోజులు. బహుశా జనవరినెల అనుకుంటాను. ఆ సందర్భంలో హాజీపీర్ కనుమను దర్శించాను. ఆ ప్రయాణం యిప్పటికీ నా మనసులో మెదులుతూనే వుంది. మేము హాజీపీర్ కొండ యెక్కుతూ వుండగానే నలువైపులా దట్టంగా మేఘాలు కమ్ముకున్నాయి. చల్లగా గాలి దుమారం రేగింది. తేలికైన జల్లులతో ప్రారంభమై కుంభవర్షం కురిసింది. ఎటు జూచినా వాతావరణం నిశ్శబ్దంగానూ, నిర్మానుష్యంగానూ, భయంకరం గానూ వుంది. తరువాత నెమ్మదిగా మంచు కూడా పడుతూ వుంది. అవసరమైన యేర్పాటులు యెన్నివున్నప్పటికీ ప్రయోజనం లేకపోయింది. అప్పటికి మేము హాజీపీర్ కొండమీద మధ్యలోనే వుండిపోయాము. వెనక్కు తిరిగి పోదామన్నా పోలేము. పోనీ ముందుకు సాగిపోదామంటే దారిలో తలదాచుకోవడానికి యెక్కడా తావులేదు. ఓ చెట్టులేదు, ఓ ఇల్లు లేదు. హాజీపీర్ కనుమకు చేరేవరకు దారిలో సురక్షితంగా వుండగల చోటేలేదు.

తడుస్తూ దడుస్తూ, వణకుతూ తొణకుతూ, రొప్పుతూ రోజుతూ, అలసి సొలసి అల్లాడిపోయి ఆ మంచు తుపానులో గుండా ఆపసోపాలు పడుతూ, ఆఖరుకు యేదో విధంగా హాజీపీర్ కనుమకు చేరుకున్నాము. అక్కడకు చేరుకునేసరికి బాగా చీకటి బడిపోయింది. షర్ఫూ ఎంతో సంతోషంతో మాకు స్వాగతమిచ్చాడు. ఇప్పుడు సైదాబీబీ అప్పటికన్న చాలా అందంగా వుంది. అప్పటికంటే గడుసుదై పోయింది. అభిమానంతో అప్పటికన్న మిన్నగా గర్వపడుతూ వుంది.

మంచు తుపాను మూడు రోజుల వరకు తగ్గలేదు. రాత్రింబవళ్ళు మంచుపడుతూనే వుంది. మేము భద్రంగా షర్ఫ్ యింట్లో తలదాచుకున్నాము. అక్కడనించి ముందుకూ పోలేము. వెనక్కు పోలేము. తెచ్చుకున్న పిండి అంతా అయిపోయింది. ఎండు మిరపకాయలు అయిపోయాయి. కాయగూరలు అయిపోయాయి. ఉర్లగడ్డలూ, ఉల్లిగడ్డలూ అన్నీ అయిపోయాయి తింటానికి యేమీ మిగలలేదు. అప్పుడు షర్ఫ్ కంబడి నెత్తిమీద వేసుకొని ఇంట్లోనుంచి బయలుదేరి పోయాడు. ఆ పర్వత ప్రాంతంలో, ఆ మంచు ప్రదేశంలో యెక్కడెక్కడ తిరిగాడో గాని, యే పల్లెకు వెళ్ళాడో గాని, మరుసటి రోజుకు మణుగు బరువు నెత్తిమీద వేసుకుని మా కోసం ఆహార పదార్థాలు తెచ్చాడు. షర్ఫ్ వచ్చేవరకు ఆ యింట్లో సైదాబీబీదే రాజ్యం. "ఆ పనిచేయమనీ, యీ పనిచేయమనీ, ఆ పని వద్దనీ, యీ పని వద్దనీ" మమ్మల్ని ఊపిరి సల్పుకో నివ్వలేదు. ఆమె మొక్కజొన్న రొట్టెలు బాగా తయారు చేస్తుందని విన్నాము. కాని తన తండ్రి కోసం అయితేనే పని చేస్తుంది. ఆమె తండ్రి కూడా ఆమెను యెక్కుసేపు పొయ్యిదగ్గిర కూర్చోనిచ్చేవాడు కాదు. పొగసెగ తగిలితే పువ్వులాంటి బుగ్గలు కమిలిపోతాయి. మేము సరేసరి ! అధికారి బిడ్డలం, ఆఫీసరు కొడుకులం! అందుచేత మమ్మల్ని గూడా యే పనీ ముట్టుకోనిచ్చే వాడు కాదు. నాలుగవ రోజుకు మంచు కురవడం ఆగిపోయింది. తెల్లవారింది. ప్రొద్దుబాగా కనబడుతూ వుంది. మేము సైదాబీబీని మాతోపాటు మంచులో ఆడుకొనడానికి పిలిచాము. "ఉహు, నేను రాను!" అంటూ ముఖం చిట్లించింది. షర్ఫ్ రెండో పెళ్ళి చేసుకోలేదు. పాపం సైదాబీబీ తల్లిలేని బిడ్డ. ఆ బిడ్డనే చూసుకుంటూ అతడు బ్రతుకు నీడుస్తున్నాడు.

నాలుగవరోజు మేము ఆ మంచుమీదుగా దారిచేసుకుంటూ బయలుదేరి పోతున్నాము. అప్పుడే నాకు హాజీపీర్‌కు అవతలి వైపున దిగువ మిట్టకు దగ్గరగా వున్న లోయలో ఒక గూజర్ జాతి వాని శవం కన్పించింది. అది చలికి బిరుసెక్కి పూర్తిగా నల్లబడిపోయింది. అతడు తొడుక్కున్నది పైజామాకాదు, నిక్కరూకాదు. ఆ గూజర్ జాతివాడు మోకాళ్ల దాటుతూ వున్న లాగు తొడుక్కొని వున్నాడు. అతని కాళ్ళకు గడ్డిపరకలతోనూ, ధాన్యపు కంకులతోనూ కట్టుకున్న గడ్డిచెప్పులు వున్నాయి. అతని నోరు తెరచుకొని వుంది. పచ్చగా గారపట్టి వున్న పళ్ళు బయటికే కనిపిస్తున్నాయి. అతని బట్టతలకు ప్రక్కగా కోణాకారంగా వున్న టోపీ పడివుంది. ఆ టోపీకి దగ్గరగా త్రాళ్ళతో ముడివేసి వున్న ఉప్పుకట్ట ఒకటి పడిపోయి వుంది. దాని బరువు దాదాపు మణుగున్నర దాకా వుండవచ్చు. అతడు ఆ ఉప్పు కట్టను మోసుకొస్తూ, ఆ గాలికీ, మంచుకూ, ఆ తుపానుకూ తట్టుకోలేక దారి తప్పి ఆ కందకంలో పడిపోయాడు. పడగానే ఊపిరిపోయి వుంటుంది.

"ఇతడు యీ ఉప్పుకట్టను యెందుకు మోసుకొస్తున్నట్లు?" అని మా కాంపౌండరు సర్వర్ ఖాన్‌ను అడిగాను.

సర్వర్‌ఖాను కూడా విచారం వెలిబుచ్చుతూ చెప్పాడు– “మనం వుండే యీ ప్రాంతంలో ఉప్పు అసలు దొరకనే దొరకదు. మనకు మంచి ఉప్పు కావాలంటే పంజాబు నుంచి రావలసిందే! కాని చలికాలం మంచు యెక్కువగా కురుస్తున్నప్పుడు, పంజాబుకు వెళ్ళివచ్చే దారులన్నీ బంద్ అయిపోతాయి. సరీగా అదే సమయంలో యీ ప్రాంతంలో వుండే వైశ్యులూ, వర్తకులూ ఉప్పు ధరను విపరీతంగా పెంచివేస్తారు. చాలా ప్రియంగా అమ్ముతారు బాబూ! పేద రైతులూ, పశువుల కాపరులూ పశువుల్ని పెంచుకుంటూ వుంటారు. వాళ్ళకు తమ ఆహారంలోనికే కాకుండా ఆ పశువుల ఆహారంలోకి కూడా ఉప్పు కావలసి వుంటుంది. మార్కెట్టులో పెచ్చుధరలకు అమ్మే ఉప్పును వాళ్ళు కొనుక్కోలేరు. అందుచేత వీళ్ళందరూ ఉడీనుంచీ, కోహాలా నుంచీ, కోహమరీ నుంచీ, రావల్‌పిండి నుంచీ, గుజరాత్ నుంచీ; యెక్కడెక్కడైతే ఉప్పు చౌకగా లభిస్తుందో అక్కడి కల్లా వెళ్ళి ఉప్పు కట్టలు కొనుక్కొని నెత్తిమీద బెట్టుకొని మోసుకొస్తూ వుంటారు. అనేక రోజులు, అనేక వందలమైళ్ళు కాలి నడకనే ప్రయాణం చేసి ఉప్పుకట్టలు తెచ్చుకుంటూ వుంటారు.”

విచిత్రమైన విషయం. ఆనాటి వరకు నాకు ఉప్పు విలువ తెలిసింది కాదు. భోజనాల టేబిలు వద్ద అనేకసార్లు వంటవాడు ఆహారపదార్థాల్లో ఉప్పు యెక్కువగా యెందుకు వేశాడని కంప్లయింటు కూడా చేసేవాణ్ణి. అటువంటి ఉప్పు ఒక్కొక్కసారి అసలు దొరకకుండా పోతుందనీ, ఆ ఉప్పుకోసం ఆ గూజర్ జాతివానిలాగా ప్రాణాలు కూడా పోగొట్టుకునే వాళ్ళు వున్నారనే విషయం ఆనాటి వరకు నాకు అర్థమయ్యింది కాదు.

ఆ గూజర్ జాతివాడు చచ్చిపడి వున్నాడు.... ఉప్పు ఆ మంచులో బడి కరిగిపోతూ వుంది. ఆ దృశ్యం అనేక వేలసార్లు నా కల్పనలో కదిలింది. నా ఊహల్లో మెదిలింది. ఆ దృశ్యం అంత స్థూలమైనదీ కాదు. అంత సూక్ష్మమైనదీ కాదు. అయినా అప్పటికి నాకు అర్థమయ్యింది కాదు.

తరువాత గూడా అనేక సంవత్సరాలలో అనేకసార్లు హాజీపీర్ కనుమకు వెళ్ళాను. ఓసారి మేము ఆలియాబాద్ మకాంలో వుండగా హాజీపీర్ లోయలోకి వేటకు వెళ్లాము. ఓసారి మెట్రిక్ పరీక్ష రాసి రావల్‌పిండి నుండి తిరిగి వచ్చేటప్పుడు వెళ్లాను. ఓసారి లాహోర్‌లో ఫార్మన్ క్రిష్టియన్ కాలేజీలో చేరడానికి పోతూ అక్కడికి వెళ్ళాను. ఈ విధంగా అనేకసార్లు హాజీపీర్ కనుమను సందర్శించాను. గతంలోని ఆ స్మృతులు కాలగర్భంలో అడుగున పడిపోయాయి. హాజీపీర్ దర్గా ముందు ఆకులు రాల్చుకొని నిలబడివున్న ఆ చెట్టు కొమ్మలకు కట్టిన చిన్న చిన్న పొట్లాములు మాసిపోయినట్లుగా అవి కూడా మాసిపోయాయి. అవి అంతగా గుర్తులో కూడా లేవు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Virigina+Vigrahalu**

* * *